క్లుప్తంగా...

పీసీసీ అధ్యక్షుడికి సన్మానం



అబిడ్స్: టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను గోషామహల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సంతోష్‌గుప్తా మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా ఘనంగా సత్కరించారు. ఆదివారం ఆయనను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..అన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు బూతు స్థాయి నుంచి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

షాహినాయత్‌గంజ్ ఇన్‌స్పెక్టర్‌గా రవీందర్



జియాగూడ: షాహినాయత్ గంజ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా నాగం రవీందర్‌ను నియమిస్తూ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన బాలు చౌహాన్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న రవీందర్‌ను నియమించారు. ఈ సందర్భంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన నాగం రవీందర్ మాట్లాడుతూ..ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తూ అసాంఘిక శక్తులపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

ముగిసిన టెలివిజన్ రచయితల శిక్షణ శిబిరం



గన్‌ఫౌండ్రీ: హైదరాబాద్ నగరం దేశంలోనే 2వ అతిపెద్ద మీడియా హబ్‌గా పెరిగిందని ప్రముఖ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు టెలివిజన్ రచయితల సంఘం, భారత్ కల్చరల్ అకడమీ, హోం సాయితేజ ఆర్ట్స్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులుగా రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న సినీ, టీవీ రచయితల, దర్శకుల శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆలోచనల సృజనాత్మకత అక్షర రూపం వస్తే రచయితలు అవుతారన్నారు. ప్రముఖ దర్శకులు వీఎన్.ఆదిత్య, వీర శంకర్, రాజ్ కందుకూరి, సత్యనారాయణ, టెలివిజన్ రచయితల సంఘం అధ్యక్షుడు నాగబాబు సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



అబిడ్స్: కెనరా బ్యాంక్ ఉద్యోగుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంప్లాయిస్ యూనియన్ ఆల్ ఇండియా కెనరా బ్యాంక్ అధ్యక్షుడు ఎంఎస్ శ్రీనివాసన్, కార్యదర్శి బి.రాంప్రకాష్ పేర్కొన్నారు. ఆదివారం జరిగిన కెనరా బ్యాంక్ ఉద్యోగుల సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడుతూ..కెనరా బ్యాంక్‌లో హెచ్‌కేపీ కర్క్స్, ఆర్మడ్ గార్డ్స్ రిక్రూట్‌మెంట్‌పై యాజమాన్యంతో చర్చలు జరిపి పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శిబీస్ మధుసూదన్, స్టేట్ కమిటీ సభ్యులు కొటి రెడ్డి, మంజుల, వినయ్ కుమార్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

అజ్మీర్ దర్గాలో చాదర్ సమర్పణ



గోల్కొండ: ఎమ్మెల్యే కౌసర్ తరపున మజ్లిస్ నాయకులు అజ్మీర్ దర్గాలో చాదర్ సమర్పించారు. ఎమ్మెల్యే ద్వారా ప్రత్యేకంగా ఒక బృందం ఆదివారం అజ్మీర్ దర్గాలో చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సమర్పించిన వారిలో మొహమ్మద్ అబ్బాస్ హుస్సేన్, ఫారుఖ్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.



మొదటి దఫాలో మొరంబావి వరకు పూర్తయిన ఎస్ఎన్‌డీపీ పనులు




నాలా విస్తరణకు నోచుకోక శిథిలావస్థలో ఉన్న మొరంబావి-ఛత్రినాక రహదారి

అటకెక్కిన నాలా విస్తరణ పనులు

- మొరంబావి-ఛత్రినాక రూట్‌లో ముంపు సమస్య
- ఎస్ఎన్‌డీపీ పనులు పూర్తి చేయాలని స్థానికుల వేడుకోలు

చాంద్రాయణగుట్ట: రాజన్నబావి ప్రాంతం నుంచి ఛత్రినాక చౌరస్తా వరకు వరద ముంపు సమస్య పరిష్కారం కోసం చేపట్టిన ఎస్ఎన్‌డీపీ (వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం) పనులు సగం వరకు మాత్రమే చేయడంతో దిగువ బస్తీల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. 35 ఏళ్ల క్రితం అప్పటి జనాభాకు అనుగుణంగా నాలుగు ఫీట్ల వెడల్పు, నాలుగు ఫీట్ల పొడవులో రాతి కట్టడంతో నిర్మించిన ఈ నాలా ప్రస్తుతం ఏ మాత్రం సరిపోవడం లేదు. వర్షాలు కురిసిన సమయంలో వర్షపు నీరు మాత్రమే వెళ్లేలా నిర్మితమైన ఈ నాలాలోకి కాల క్రమేణా పూర్తిగా డ్రైనేజీ లైన్లను కలిపేశారు. దీంతో రోజు రోజుకూ నాలా పూడుకుపోయి వర్షపు నీరు పూర్తిగా రోడెక్కి బస్తీలలోని ఇళ్లను ముంచెత్తుతూ ప్రవహిస్తుంది. వట్టిపల్లి, ఫలక్‌నుమా, గాంధీనగర్, రాజన్నబావి ప్రాంతాల నుంచి వచ్చే వరదనీరు మొరంబావి, శివగంగా నగర్‌ల మీదుగా ఛత్రినాక వరకు పెద్ద ఎత్తున పొంగి పొర్లుతోంది. ఈ వరద ధాటిలో వాహనాలు సైతం కొట్టుకుపోతున్నాయంటే సమస్య తీవ్రత ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. స్థానికులు పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించుకోవడంతో రాజన్నబావి నుంచి మొరంబావి వరకు నాలా విస్తరించి బాక్స్ డ్రైన్‌ను నిర్మించారు. ఈ పనులు పూర్తయి నాలుగేళ్లు దాటుతున్నా మొరంబావి నుంచి ఛత్రినాకకు పనులను ప్రారంభించడం లేదు.



మొరంబావి ప్రాంతంలో వరద నీటిలో కొట్టుకుపోతున్న ఆటో (ఫైల్)

500 మీటర్ల పొడవులో బాక్స్ డ్రైన్ నిర్మాణం

రాజన్నబావి నుంచి 500 మీటర్ల దూరంలో రూ.3 కోట్లతో మొదటి దఫాలో నాలా పనులు పూర్తి చేశారు. రాజన్నబావి నుంచి ఛత్రినాక వరకు మొత్తం 900 మీటర్ల దూరం ఉన్నప్పటికీ..మొదటగా 500 మీటర్ల దూరంలో ఈ పనులు చేపట్టారు. ఈ నాలా ఆధునీకరణ పనులను పూర్తిగా కాంక్రీట్ బాక్స్ డ్రైన్‌గా చేపట్టారు. అడుగు, పైభాగం.. పక్క భాగాలలో కూడా పూర్తిగా కాంక్రీట్‌తో పక్కాగా నిర్మించారు. గతంలో నాలుగు ఫీట్ల పొడవు, వెడల్పుతో చిన్నపాటిగా ఉన్న ఈ నాలాను 12 ఫీట్ల వెడల్పు, 10 ఫీట్ల పొడవులో నిర్మించారు.

కనీసం నడిచి వెళ్లలేని స్థితికి చేరుకున్న రహదారి..

మొరంబావి నుంచి ఛత్రినాక వరకు 400 మీటర్ల పొడవులో బాక్స్ డ్రైన్ వేయని అధికారులు..రోడ్డు శిథిలమైనందున కొత్త రోడ్డు వేస్తామని పాత రోడ్డును తవ్వేశారు. నాలా నిర్మించేంత వరకు రోడ్డు వేసే ప్రసక్తే వద్దని కొందరు స్థానికులు భీష్మించడంతో పరిస్థితి ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యింది. అటు నాలా నిర్మాణం కాక, ఇటు రహదారి లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నాలా నిర్మాణం కోసం స్థానిక ప్రజలు ఎమ్మెల్యే, ఎంపీ, అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. ఈ ముంపు సమస్యను 'హైడ్రా' అధికారులు కూడా తమ జాబితాలో చేర్చుకున్నారు తప్ప సమస్య పరిష్కారానికి కార్యరూపం దాల్చడం లేదు.

వెంటనే నాలాను నిర్మించాలి..



వర్షాకాలం వస్తుందంటేనే వణుకు పుడుతుంది. మొదట పేర్కొన్న మాదిరిగానే మొరంబావి నుంచి ఛత్రినాక వరకు వర్షాకాలం వచ్చే లోపే నాలాను నిర్మించాలి. ముంపు ధాటికి ఇళ్లల్లోకి నీరు రావడమే కాకుండా ఆటోలు సైతం కొట్టుకుపోతున్నాయి. రాజన్నబావి నుంచి మొరంబావి వరకు నాలా విస్తరించగా, అక్కడికి వచ్చాక నాలా చిన్నదిగా ఉండడంతో నీరంతా ఒక్కసారిగా పైకి ఎగబాకుతూ వస్తుంది. కొత్త రోడ్డు వేస్తామని ఉన్న రోడ్డును తవ్విన అధికారులు..తాత్కాలికంగానైనా వాహనదారులకు ఇబ్బందులు లేకుండా బీటీ వేయాలి.

– కైలాష్ రాఘవేంద్ర, మొరంబావి

16 ఏళ్లుగా అన్నదానం చేయడం అభినందనీయం



సామగ్రి లారీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్ తదితరులు

అఫ్జల్‌గంజ్: ఉస్మాన్‌గంజ్‌లోని భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి (బాస్) ఆధ్వర్యంలో నీలక్కల్ మార్గమధ్యలో ఈ నెల 7 నుంచి 14 వరకు అయ్యప్ప స్వాములకు ఏర్పాటు చేయనున్న అన్నదానం సామగ్రి లారీని ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్లు శంకర్ యాదవ్, రాకేష్ జైస్వాల్ జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు బాస్ ప్రధాన కార్యాలయంలో www.helpaneedy.in వెబ్‌సైట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. 16 ఏళ్లుగా బాస్ సంస్థ అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. కేరళ ప్రభుత్వంతో మాట్లాడి అక్కడ 10 ఎకరాల భూమిని తీసుకొని శబరిమల వెళ్లే తెలుగు రాష్ట్రాల అయ్యప్ప స్వాముల కోసం అక్కడ వసతి, భోజన సౌకర్యం కల్పించాలని రాజాసింగ్ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు క్యాతం రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి రాకేష్, కోశాధికారి సీపీ అనిల్, బాస్ ప్రతినిధులు విజయ్ భాస్కర్, విజయేందర్‌రెడ్డి, నర్సింగ్‌రావు, వేణు, శ్రీహరి, భిక్షపతి, జగదీష్‌గుప్తా, అశోక్, రాఘవేందర్, కాటేపల్లి రాజు, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: బస్తీల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని రెయిన్ బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ అన్నారు. డివిజన్ పరిధిలోని యాకుత్‌పురా, అజ్మత్‌నగర్, మదీనానగర్ ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించి ఆయా ప్రాంతాల్లో కొనసాగుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్థానిక సమస్యల పరిష్కారానికి పలు అభివృద్ధి పనులు ప్రారంభించమన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

చైనా మాంజాను విక్రయిస్తే కఠిన చర్యలు



గాలిపటాల దుకాణదారులతో సమావేశమైన ఇన్‌స్పెక్టర్ నాగదుర్గా ప్రసాద్

గౌలిపురా: సంక్రాంతి సందర్భంగా చైనా మాంజా విక్రయించకూడదని మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్ నిర్వాహకులకు సూచించారు. మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన గాలిపటాల దుకాణదారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నాగదుర్గా ప్రసాద్ మాట్లాడుతూ..ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా నిషేధించిన చైనా మాంజా విక్రయాలు చేపడితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

కేలండర్ల ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మదిర సత్యనారాయణ



షియా అస్నా అశారీ వక్ఫ్ ప్రొటెక్షన్ ఫ్రంట్ ఆధ్వర్యంలో..



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కృష్ణ యాదవ్, తీగల కృష్ణారెడ్డి

జియాగూడ: ప్రతి ఏటా ఇమాంపురా నవ భారత సంఘం కేలండర్‌ను ఆవిష్కరించామని సంఘం అధ్యక్షుడు మధిర సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఎంసీహెచ్ కమ్యూనిటీ హాల్‌లో సంఘం కేలండర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యక్షులు జి.వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వ.జస్వంత్ కుమార్, కోశాధికారి ఎం.మహేష్‌బాబు, సంఘం ప్రతినిధులు జి.బాలకిషన్, వై.యాదయ్య, ఎం.నర్సింగ్ రావు, కె.శ్రీకాంత్, జి.మహేందర్, సి.నర్సింగ్‌రావు, ఎ.గౌతమ్, వి.అరుణ్, ఎ.రాజ, డి.ధన్‌రాజ్, యశ్వంత్‌కుమార్ పాల్గొన్నారు.

యాకుత్‌పురా: షియా అస్నా అశారీ వక్ఫ్ ప్రొటెక్షన్ ఫ్రంట్ ఆధ్వర్యంలో రూపొందించిన రహనుమా-ఇ-అవామ్ నూతన సంవత్సరం కేలండర్ ను ఆదివారం దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మీర్‌చౌక్ ఏసీపీ వెంకటేశ్వర్‌రావు, రెయిన్ బజార్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, షియా అస్నా అశారీ వక్ఫ్ ప్రొటెక్షన్ ఫ్రంట్ అధ్యక్షుడు మీర్ హైదర్ అలీ జాఫ్రీ, ఎన్‌సీపీయూఎల్ సభ్యుడు మహ్మద్ అబ్దుల్ సత్తార్, ఎస్సైలు నస్రీన్ బేగం, అరుణోదయ్, నాయకులు మహ్మద్ జైనూద్దీలాబిద్దీన్, మెహదీ ఖాజ్మీ, జాహీద్ అలీ మీర్జాలు పాల్గొన్నారు.

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయానికి సంబంధించి భక్తుడు రంగ హరినాథ్ గౌడ్ రూపొందించిన 2025 సంవత్సరానికి సంబంధించిన నూతన కేలండర్‌ను మాజీ మంత్రి సి.కృష్ణ యాదవ్, హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు సి.శివ కుమార్ యాదవ్, మాజీ చైర్మన్ కాశీనాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



కుస్తీ పోటీల్లో గోషామహల్ కాంగ్రెస్ నాయకుడు బజ్జుగోప్

అబిడ్స్: క్రీడాకారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బజ్జు గోప్ పేర్కొన్నారు. ధూల్‌పేట మినీ స్టేడియంలో వీర్ బజరంగ్ కేసరి–2025 కుస్తీ పోటీల్లో 65 కిలోల విభాగం కుస్తీ పోటీని బజ్జుగోప్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ధూల్‌పేట, బేగంబజార్ కుస్తీ పోటీలకు పుట్టినిల్లు అన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించే విధంగా అందరూ వారికి అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో లాల్‌గోప్, పర్వేజ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగింత



గౌలిపురా: ఇంటి ముందు ఆడుకుంటూ తప్పిపోయిన ఓ బాలుడిని భవానీనగర్ పోలీసులు ఆదివారం గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. భవానీనగర్ స్టేషన్ ప్రాంతానికి చెందిన ఆర్షియా బేగం, మహ్మద్ ఫరీద్‌ల కుమారుడు మహ్మద్ షాబెజ్ (4) ఆదివారం ఇంటి ముందు ఆడుకుంటూ కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాల్లో వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తన సిబ్బందితో కలిసి స్టేషన్ పరిధిలోని సీసీ కెమెరాలను పరిశీలించి తప్పిపోయిన బాలుడిని గుర్తించారు. అనంతరం బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు ఏర్పాట్లు



- ముస్తాబవుతున్న చార్మినార్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయాలు
- ఈ నెల 10 నుంచి 14 వరకు ఉత్సవాలు
- భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ముందు జాగ్రత్త చర్యలు



డీసీపీ స్నేహా మెహ్రాకు ఆహ్వానం అందజేస్తున్న ఆలయ ప్రధానాచర్చకులు శృంగారం రమణాచార్యులు, ప్యారసాని వెంకటేష్

చార్మినార్: పాతబస్తీలోని వేంకటేశ్వర స్వామి ఆలయాలు వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు ముస్తాబవుతున్నాయి. ఈసారి జరిగే మహోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి వారి పల్లకీ ఊరేగింపు తదితర కార్యక్రమాలను కూడా పెద్ద ఎత్తున నిర్వహించడానికి కార్యాచరణను రూపొందించారు. ఇందులో భాగంగా పలువురు అధికార, అనధికార ప్రముఖులకు ఆహ్వాన పత్రాలను అందజేసి ఆహ్వానిస్తున్నారు. దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రాను ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆలయ ప్రధాన అర్చకులు రమణాచార్యులు, ప్రతినిధి ప్యారసాని వెంకటేష్‌తో కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు.

1961 నుంచి..

చార్మినార్ చౌక్ మైదాన్ ఖాన్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో 1961 నుంచి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈసారి ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి ఆలయ ప్రధాన అర్చకులు శంగారం రమణాచార్యులు, అలంకార బ్రహ్మ ఆత్రేయాచార్యులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఇప్పటికే బ్రోచర్‌ను విడుదల చేశారు. ఉత్సవాల సందర్భంగా పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన పలువురు కళాకారులతో వివిధ రకాల పూలతో ఆలయాన్ని అందంగా ముస్తాబు చేయించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

కనుల పండువగా పల్లకీ ఊరేగింపు..

చౌక్ మైదాన్ ఖాన్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 10 నుంచి 14 వరకు వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను కనుల పండువగా నిర్వహించనున్నాం. ఈ నెల 10న ఉదయం 6 గంటలకు నేత్ర దర్శనం, హారతి, 6.30 గంటలకు వైకుంఠ ద్వార దర్శనం అనంతరం ఆలయం నుంచి స్వామి వారి పల్లకీ సేవ ఊరేగింపు నిర్వహించనున్నాం. ఉదయం 6 గంటల నుంచి రాత్రి ఒంటి గంటల వరకు ప్రత్యేక దర్శనం ఉంటుంది. చార్మినార్, గుల్జార్‌హౌజ్, కాలీకమాన్, పంజేషా, ఎతేబార్‌చౌక్, కోట్లా ఆలిజా ద్వారా తిరిగి వేంకటేశ్వర స్వామి ఆలయానికి చేరుకుంటుంది.

– శృంగారం ఆత్రేయాచార్యులు, ఆలయ అర్చకులు